క్లుప్తంగా

'జగనన్న సురక్ష' నేడు

ఆనందపురం : మండలంలోని వేములవలస, పెద్దిపాలెం సచివాలయాల్లో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తామని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు.

అనిట్స్‌లో క్యాంపస్ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో సీఈవో నిరంజన్‌కుమార్, తదితరులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ దంతవైద్య కళాశాల (అనిట్స్)లో ఈ నెల 3, 4వ తేదీల్లో ముంబయికి చెందిన ఐకేఎస్ హెల్త్ కంపెనీ క్యాంపస్ ఎంపికలు నిర్వహించింది. ఇందులో 48 మంది విద్యార్థులు పాల్గొనగా 26 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన వారిని కళాశాల సీఈవో నిరంజన్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి అభినందించారు.

చెత్త పన్ను రద్దు చేయాలని ఆందోళన

మధురవాడ: చెత్త పన్ను, పెంచిన కరెంటు చార్జీలు రద్దు చేయాలని మధురవాడలోని 67వ నంబరు సచివాలయం వద్ద సీపీఎం నాయకులు గురువారం ధర్నా చేశారు. అనంతరం వారు సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ పెంచిన పన్నులు రద్దు చేయాలని ఎన్ని రూపాల్లో విన్నవించినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని సిబ్బంది బెదిరిస్తున్నారని, ఈ పద్ధతి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.కొండమ్మ, కె.సుజాత, డి.తులసి, ఎం.కనకరత్నం, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

ఆనందపురం : జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ విశాఖ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్ అన్నారు. మండలంలోని వెల్లంకిలో గురువారం ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ అఖండ భారతావని నిర్మాణం కోసం ప్రాణదానం చేసిన మహనీయుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు లెంక శ్రీరామ్, అనీల్ రాజు, బోర శ్రీను, ఇంటి సత్తిరాజు, మల్లారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట – ఆదర్శనగర్‌లో ఏటా ఆషాడమాసంలో జరిపే ఎల్లమ్మతల్లి ఉత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లను ఆయన తిలకించారు. ఉత్సవ ప్రతినిధులు వందలాది మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చేట్ల నరసింగరావు, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాత్రలు పంపిణీ

తగరపువలస: జీవీఎంసీ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. ఆశా వర్కర్ స్వాతి, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ రక్తహీనత నివారణకు ఈ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై వివరించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.

రోజుల వ్యవధిలో ధ్రువీకరణ పత్రాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: రోజుల వ్యవధిలో ధ్రువీకరణ పత్రాలు పొందడం గతంలో ఎన్నడూ జరగలేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 2వ వార్డు తగరపువలసలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అర్హులై ఉండి ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే నెలలు, సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశాక అవసరమైన పత్రాలు ఎంతో సులభంగా పొందే అవకాశం ఏర్పడిందన్నారు. అర్హులందరికీ ప్రయోజనం కలిగించాలనే ఉద్దేశంతోనే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇలా దేశంలో ఏ రాష్ట్రంలోనూ పథకాలు అమలు కావడం లేదన్నారు. సంక్షేమ పాలనను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, రోజూ అర్థం లేని, ఆధారాలు లేని పిచ్చి ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వారిని ప్రజలు నమ్మడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని, తనకు మద్దతుగా నిలిచి మళ్లీ గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పి.బాలరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మేలు చేస్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా అందరూ నిలవాలని కోరారు. అనంతరం అర్హులకు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఇక్కడి అయిదు సచివాలయాల పరిధిలో 1,814 దరఖాస్తులురాగా 1,436 మందికి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ రెండో వార్డు ఇన్‌చార్జి శిల్ల సరళారాణి, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ మేలు మరువలేనిది



'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎంతో సులభంగా అందుకున్నాను. గతంలో ప్రతి చిన్న పనికీ తహసీల్దార్, జోనల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సీఎం జగన్ దయవల్ల అవసరమైన పత్రాలు వెంటనే అందుకుంటున్నాం. ఆయన మేలు మరువలేనిది.

– గోగుల సత్యవతి, ఆదర్శనగర్

జీవితాంతం సీఎం జగన్‌కే మద్దతు



తమందరికీ మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలతో సీఎం జగన్ మేలు చేస్తున్నారు. ఆయన వల్ల మా జీవన విధానంలో మార్పులు వచ్చి బాగున్నాం. అవసరమైన పనులు ఎంతో సులభంగా జరుగుతున్నాయి. మేం జీవితాంతం జగన్‌కు మద్దతుగా ఉంటాం.

– వలపాల విజయలక్ష్మి, చిన్నబజారు

కొత్తమ్మతల్లికి ఇత్తడి హస్తాలు



ఇత్తడి హస్తాలను అందిస్తున్న దాతలు లక్ష్మణరావు తదితరులు

తగరపువలస: సంగివలస కొత్తమ్మతల్లికి దాతలు గురువారం రూ.60 వేల విలువైన ఇత్తడి హస్తాలు అందించారు. అమ్మవారి పది చేతులకు సరిపడా వీటిని కోరాడ లక్ష్మణరావు, పెంగి శరత్‌కుమార్, సాయ సమర్థ తదితరులు ఈవో బి.ప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, ప్రధాన అర్చకులు నరసింహామూర్తి, ఏడిద రామకృష్ణ శర్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



తగరపువలసలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పద్మావతి

తగరపువలస: జీవీఎంసీ సంతపేట అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి గురువారం 200 మంది అభాగ్యులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి భీమిలి మున్సిపాల్టీ మాజీ వైస్ చైర్మన్ మొకర నారాయణరావు వర్ధంతి సందర్భంగా వీటిని అందించినట్టు తెలిపారు. కె.ముత్యాలరావు, పత్రి సన్యాసిరావు, గుజ్జు సూర్యం పాల్గొన్నారు.

నారాయణరావుకు ఘన నివాళి

భీమునిపట్నం: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నాగవంశీయుల కుల పెద్ద మొకర నారాయణరావు వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

సేవామూర్తి శ్రీనివాసరెడ్డికి సత్కారం



వెంపాడ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు

తగరపువలస: ఇటీవల డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ద్వారా గౌరవ డాక్టరేట్, ఇన్‌ఫ్లుయెన్సర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డిని గురువారం చిట్టివలస పోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు, ఫుట్‌బాల్ రిఫరీ పందిరి శ్రీనివాసరావు, రాంజీ, పందిరి విజయ్, కంఠిమహంతి మహేష్, కొంత్యాన జడ్సన్ రాబర్ట్‌సన్, చేట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తున్నాం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ప్రజలకు అవినీతి రహిత, పారదర్శక పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ 64వ నంబరు సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే పరిశీలించి అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. 1బి బ్లాక్ వద్ద డ్రైనేజీ నిర్మాణం, 1 నుంచి 8వ బ్లాకుల వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగి ఇబ్బందులు, 5బి వద్ద అండర్ గ్రౌండ్ సెప్టిక్ ట్యాంక్‌కి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇటువంటి ప్రజారంజక పాలన, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరిన్ని మంచివి రావాలన్నా మళ్లీ జగన్‌మోహన్ రెడ్డే ముఖ్యమంత్రి కావాలని, ఈ ప్రభుత్వాన్ని, తనను అంతా ఆదరించాలని కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, రైల్వే బోర్డు సభ్యుడు బాబ్జి, పిళ్లా సూరిబాబు, తమ్మినేని వరలక్ష్మి, మంగ, జగ్గుపిల్లి నరేష్, రామిరెడ్డి, ఎల్లాజీ, పెంట్ర అప్పన్న, జెడ్సీ కె.కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, విద్యుత్ శాఖ ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పద్మనాభం: రెడ్డిపల్లి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిపల్లి, శేరికండం, పొట్నూరు, తునివలస, విజయానందపురం, భద్రయ్యపేట, సుంకరపేట, నరసాపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొన్ని ప్రాంతాల్లో శనివారం...

కొమ్మాది: పలు ప్రాంతాల్లో లైన్‌లను తాకుతున్న కొమ్మలను తొలగించే క్రమంలో గొల్లలపాలెం, కుమ్మరపాలెం, బిల్లాలమెట్ట, మామిడిపాలెం, ఆనందవనం, జీవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శంకరయ్య తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

'ప్రయాణికుల కోసం హైవే గ్రిల్స్ కట్ చేయిస్తాం'

మధురవాడ: జాతీయ రహదారిపై మధురవాడ 'జాతర' వద్ద జీబ్రాలైన్స్ ఏర్పాటు చేసి, ప్రయాణికులు రోడ్డు దాటడానికి వీలుగా గ్రిల్స్ కట్ చేయిస్తామని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. గురువారం ఆమె జాతర ఎదురుగా గల హైవేపై ఏర్పాటు చేసిన కార్‌షెడ్ బస్ షెల్టర్ వద్ద నుంచి ప్రయాణికులు రోడ్డు దాటుతున్న ప్రమాదకర పరిస్థితులు గమనించారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి హైవే రోడ్డు సెంటర్ డివైడర్‌పై ఇటు ఏసీఏ – వీడీసీఏ వైఎస్సార్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది వరకు అధికారులు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే బస్టాప్ ఎదురుగా కూడా రోడ్డు సెంటర్ డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేసేశారు. దీంతో జాతర వైపు నుంచి మిథిలాపురి వుడా కాలనీ వైపు వెళ్లే ప్రయాణికులు ఇరువైపులా 100 మీటర్ల పైనే హైవేపై నడుచుకుని వెళ్లి రోడ్డు దాటాల్సిన ప్రమాదకర పరిస్థితులు తలెత్తాయి. ఇక్కడ ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులుపై సాక్షి ప్రతికలో 'బస్టాపునకు దారేది..!' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై ఆమె స్పందించారు. హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పనులు చేసేందుకు చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి చెప్పారు.

యువకుడు అదృశ్యం



బాబూరావు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధి తగరపువలసలో నివసిస్తున్న సల్ల బాబూరావు (25) ఈ నెల 2న అదృశ్యం కావడంతో అతని భార్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్టౌలకు మరమ్మతులు చేసుకుంటూ భార్య, నలుగురు పిల్లలతో నివసిస్తున్న బాబూరావు గత ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఫ్రెండ్స్‌ను కలిసి వస్తానని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తర్వాత ఇంటికి చేరలేదు. ఆచూకీ తెలిస్తే భీమిలి పోలీసులకు 91826 94835లో తెలియజేయాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు దీక్ష

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు శుక్రవారం నుంచి చేపడుతున్న 24 గంటల దీక్షకు ప్రజలు, ప్రజాసంఘాలు సంఘీభావం తెలపాలని సిటు నాయకులు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం చిట్టివలస సిటు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విక్రయాన్ని మోదీ ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, స్వామి, హరి, గోవింద్ పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం



వ్యాధులపై అవగాహన కలిగిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేట రెల్లివీధి కాలనీలో సీజనల్ వ్యాధులు, తడి పొడి చెత్తపై స్థానికులకు జెడ్సీ బొడ్డేపల్లి రాము గురువారం అవగాహన కలిగించారు. అక్కడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో రక్షణగోడ

తగరపువలస: మండల పరిషత్ నిధులతో భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ కొత్తూరులో రక్షణ గోడ నిర్మించనున్నట్టు ఎంపీపీ దంతులూరి వాసురాజు తెలిపారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు కొత్తూరులో కూలిపోయిన రక్షణగోడను ఆయన పరిశీలించారు. సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, పొట్నూరు చంద్రశేఖర్ తదితరుల వినతి మేరకు గురువారం రక్షణగోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలించారు. గతంలో ఈ గోడ పునరుద్ధరణకు పంచాయతీ పాలకవర్గం తన దృష్టికి తీసుకొచ్చిందన్నారు. తక్షణమే గోడ నిర్మించేందుకు మండల పరిషత్ నిధులు ఖర్చు చేస్తామన్నారు. మండలంలో ఇలాంటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వీటిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జీవామృతంతో పెరగనున్న భూసారం



జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న హేమసుందర్

ఆనందపురం : పంటలకు జీవామృతాన్ని వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు రావడమే కాకుండా భూసార స్వభావం పెరుగుతుందని రైతు సాధికార సంస్థ ప్రాంతీయ అధికారి హేమ సుందర్ చెప్పారు. మండలంలోని తర్లువాడలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు గురువారం మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఇందులో జీవామృతం ప్రధాన భూమిక పోషిస్తుందని, దీన్ని కాలువుల్లోని నీటితో కలిపితే అందులో ఉన్న బ్యాక్టీరియా నేలలోని పోషకాలను కరిగించి మొక్కలకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా 10 ఎకరాల్లో సాగు చేస్తున్న 17 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం, జీవామృత తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి మోహనరావు, సిబ్బంది అనురాధ, వనజ, రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



మధురవాడ అప్ బ్రిడ్జి కింద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ జాన్ మనోహర్

మధురవాడ: మధురవాడలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎం.జాన్ మనోహర్ చెప్పారు. గురువారం సాయంత్రం మధురవాడ అప్ బ్రిడ్జి, ఇతర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా మధురవాడ అప్ బ్రిడ్జి కిందకి ఆటోలు, కార్లు, ఇతర భారీ వాహనాలు అనుమతించమని తెలిపారు. వీరు కార్‌షెడ్, కొమ్మాది కూడళ్ల నుంచే టర్న్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే కార్‌షెడ్ నుంచి వుడా కాలనీ రోడ్డు మీదుగా టర్న్ అవుతున్న ఆర్టీసీ బస్సులు రూట్ మార్చేందుకు, ఆటోల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మరిన్ని చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సాయి పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



మాట్లాడుతున్న సేంద్రియ వ్యవసాయం రీజినల్ ఆఫీసర్ హేమసుందర్



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారి సంధ్యరత్న ప్రభ

ఆనందపురం : విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయాధికారి సంధ్యా రత్న ప్రభ సూచించారు. మండలంలోని బోని గ్రామంలో గురువారం పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి విత్తన శుద్ధిపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలను నేరుగా చల్లడం వల్ల వాటిపై ఉండే సిలీంద్రియాలు మొలకెత్తే దశలో నష్ట పరుస్తాయని వివరించారు. ఒక కిలో వరి విత్తనానికి 8 గ్రాముల సుడోమోనాస్‌ని కలిపి విత్తన శుద్ధి చేయడం వల్ల పంటపై వచ్చే అగ్గి తెగులును నివారించవచ్చని చెప్పారు. రైతులందరూ విత్తనాలను మొలక కట్టిన తర్వాతే నారుపోతలు చేయాలన్నారు. సచివాలయ వ్యవసాయాధికారి దిలీప్ చక్రవర్తి, మాధురి, రైతులు పాల్గొన్నారు.

పద్మనాభం: వరి నారు పోసే ముందు రైతులు విత్తన శుద్ధి చేయాలని సేంద్రియ వ్యవసాయం రీజినల్ ఆఫీసర్ హేమసుందర్ సూచించారు. కోరాడ రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు విత్తన శుద్ధిపై ఆయన అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుందన్నారు. విత్తనాల నుంచి సంక్రమించే తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. భీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేయాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహనరావు, చక్రవర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ర్యాబిస్ వ్యాధికి టీకాతో అడ్డుకట్ట



మధురవాడలో కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు అనుపమ

మధురవాడ: పిచ్చి కుక్కల ద్వారా మనుషులకు సోకే ప్రాణాంతకమైన వ్యాధి ర్యాబిస్ అని, వ్యాక్సినేషన్ ద్వారా దీనికి అడ్డుకట్ట వేయవచ్చని జీవీఎంసీ జోనల్ ఆఫీసు సమీపంలోని చంద్రంపాలెం పశువైద్య కేంద్రం అధికారి ఆర్.అనుపమ అన్నారు. గురువారం అంతర్జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 84 కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్క చొంగ, గీకినప్పుడు, కరిచినప్పుడు మనుషులకు ర్యాబిస్ సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నారాయణ, జేవీవో అప్పారావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలిలోని పశువైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కల దినం సందర్భంగా 179 కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో ఉచితంగా వేశారు. అనంతరం మూగజీవాల సంరక్షణపై సూచనలు చేశారు.

స్మార్ట్ నానో టెక్నాలజీతో జీవన ప్రమాణాల పెంపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ దయానంద సిద్ధవట్టం

కొమ్మాది: స్మార్ట్ నానో టెక్నాలజీతో మానవ జీవన ప్రమాణాలు పెంచడానికి పరిశోధకులు కృషి చేయాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం, ఖతార్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ నెల 8 వరకు నిర్వహిస్తున్న స్మార్ట్ నానో టెక్నాలజీస్ అంతర్జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణం, వైద్య రంగం, శక్తి ఉత్పాదక రంగాల్లో నానో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సుస్థిర అభివృద్ధికి సహజ వనరులను పొదుపుగా వినియోగించడానికి నానో టెక్నాలజీ పరిశోధనలు దోహదపడాలన్నారు. ఈ సదస్సులో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 50 మందికి పైగా శాస్త్రవేత్తలతోపాటు డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రొఫెసర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.